క్లుప్తంగా

సమస్యలను పరిష్కరించాలి

ప్రొద్దుటూరు : స్థానిక 16వ వార్డు దళితవాడ ప్రజల సమస్యలను పరిష్కరించాలని సీపీఐ ఏరియా కార్యదర్శి పి.సుబ్బరాయుడు తెలిపారు. శుక్రవారం వార్డులో సీపీఐ బృందం పర్యటించింది. ఈ సందర్భంగా సుబ్బరాయుడు మాట్లాడుతూ మురికి కాలువలోని నీరు వర్షం నీటితో కలిసి ఇళ్లలోకి వస్తోందని, దీంతో ప్రజలు రోగాల బారిన పడి తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఈ వార్డులో ఉన్న 18వ వార్డు సచివాలయానికి అభివృద్ధి పనులకు రూ.20 లక్షలు మంజూరైతే ఆ నిధులను దారిమళ్లించారన్నారు.

నేడు సర్వసభ్య సమావేశం

ప్రొద్దుటూరు కల్చరల్ : బీసీ సమాఖ్య సర్వసభ్య సమావేశాన్ని ఆదివారం సాయంత్రం 5 గంటలకు నందిని క్లాత్‌మార్కెట్‌లోని బీసీ సమాఖ్య కార్యాలయంలో నిర్వహించనున్నట్లు సమాఖ్య కార్యనిర్వాహక అధ్యక్షుడు గొడుగు గురప్ప, ప్రధాన కార్యదర్శి బీవీ రమణరాజు తెలిపారు. సమావేశంలో సమాఖ్య శాశ్వత సభ్యులు పాల్గొని సమావేశాన్ని జయప్రదం చేయాలని కోరారు.

రేపు 'విపంచిక' పుస్తకావిష్కరణ

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక శ్రీకృష్ణగీతాశ్రమంలో ఆదివారం ఉదయం డాక్టర్ పెరుగు భవానిశంకర్ రచించిన 'విపంచిక' ఖండ కావ్యావిష్కరణ చేస్తున్నట్లు రచయిత జింకా సుబ్రహ్మణ్యం తెలిపారు. స్థానిక ప్రెస్‌క్లబ్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఇది రచయిత రెండవ కావ్యమని దేశభక్తి భావాలు, భారతీయ సంస్కృతి, సాంప్రదాయాలు తదితర వాటి గురించి వివరించారన్నారు. సాహితీ అభిమానులు పాల్గొనాలని ఆయన కోరారు.

రైతులకు సమాచారం ఇవ్వాల్సిందే

కాశినాయన : దరఖాస్తు చేసుకున్న వారికి సమాచారం ఇవ్వాల్సిందేనని పోరుమామిళ్ల సహాయ వ్యవసాయ సంచాలకులు ఎం.మురళీధర్‌రెడ్డి పేర్కొన్నారు. నరసాపురం రైతు సేవా కేంద్రంలో సమాచార హక్కు చట్టంపై రైతులకు, వ్యవసాయ సహాయకులకు శుక్రవారం ఆయన అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాచార హక్కు చట్టం ప్రకారం దరఖాస్తు చేసుకున్న 30 రోజులలోపు సమాచారం ఇవ్వాలన్నారు.

వార్డు సభ్యులు కీలకం

చాపాడు : మండలంలోని గ్రామ పంచాయతీలు అభివృద్ధి చెందడంతో వార్డు సభ్యులు కీలకంగా వ్యవహరించాలని ఎంపీడీఓ వీర కిషోర్ సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయ సభా భవనంలో శుక్రవారం ఉప సర్పంచ్‌లు, వార్డు సభ్యులకు రిఫ్రెషర్‌పై శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ గ్రామాల్లో ఎలాంటి సమస్యలు ఉన్నా వాటిని అధికారుల దృష్టికి తీసుకురావాలని కోరారు. అనంతరం గ్రామ పంచాయతీలో నిధులు, విధులపై శిక్షకులు దేవేంద్రరెడ్డి, జానకీరామ్, సుబ్బరాయుడు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఏఓ రామానుజం, ఈఓపీఆర్డీ రాధాకృష్ణవేణి, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

డ్రైనేజీ సమస్యలను పరిశీలించిన కమిషనర్

ప్రొద్దుటూరు : మున్సిపాలిటీ పరిధిలోని పలు ప్రాంతాల్లో మున్సిపల్ కమిషనర్ వి.మల్లికార్జున శుక్రవారం ఉదయం పర్యటించారు. ప్రధానంగా డ్రైనేజీ కాలువల సమస్యల పరిష్కారం కోసం సిబ్బందితో చర్చించారు. వైఎంఆర్ కాలనీలోని పెద్దమ్మచెట్టు వద్ద నిల్వ ఉన్న నీటిని తొలగించడంతోపాటు ఖాదర్‌హుసేన్ మసీదు వద్ద ఉన్న డ్రైనేజీ కాలువను పరిశీలించి పునర్నిర్మాణం కోసం అంచనాలు తయారు చేయాలని అధికారులను ఆదేశించారు.

వస్తువులు వితరణ

ప్రొద్దుటూరు : స్థానిక రామేశ్వరంలోని రాష్ట్రీయ సేవా సమితి వికాస్ విహార్ మానసిక వికలాంగుల శిక్షణ కేంద్రంలోని దివ్యాంగ విద్యార్థులకు శుక్రవారం మానవత స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో స్టీల్ బాటిళ్లు, స్వీట్లు అందించారు. అలాగే హౌసింగ్ బోర్డులోని భవిత కేంద్రంలో ప్రత్యేక అవసరాల విద్యార్థులకు భోజనం వసతి కల్పించారు. మానవత స్వచ్ఛంద సేవా సంస్థ చైర్మన్ కళావతి మాట్లాడుతూ పులి రామసుబ్బారెడ్డి తన తండ్రి పులి సుబ్బిరెడ్డి 18వ వర్ధంతి సందర్భంగా రూ. 10, 500 అందజేశారని, ఆ మొత్తంతో విద్యార్థులకు వీటిని అందజేశామని తెలిపారు.

నేటి నుంచి రీసర్వేపై గ్రామ సభలు

గోపవరం : రీ సర్వేపై నేటి నుంచి గ్రామ సభలు నిర్వహించనున్నట్లు తహసీల్దారు త్రిభువన్ రెడ్డి తెలిపారు. మండలంలోని కాలువపల్లె, లక్కవారిపల్లె రెవెన్యూ గ్రామాల్లో రీసర్వే పూర్తయిందని, గ్రామసభలు నిర్వహించి సమస్యలను పరిష్కరిస్తామని ఆయన తెలిపారు. ఈ నెల 19న కాలువపల్లె గ్రామ సచివాలయం, 22, 23వ తేదీల్లో లక్కవారిపల్లెలోని రామాలయం వద్ద గ్రామసభ లు నిర్వహించనున్నట్లు తహసీల్దారు తెలిపారు.

స్వర్ణోత్సవ మహాసభలు

పోరుమామిళ్ల : ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్(యుటీఎఫ్) ఆవిర్భవించి 50 ఏళ్లు పూర్తయిన సందర్భంగా స్వర్ణోత్సవ మహాసభలు నిర్వహిస్తున్నట్లు ఆ సంఘం జిల్లా కార్యదర్శి కుర్రా చెన్నయ్య తెలిపారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో లక్షా 20 వేల మంది సభ్యత్వంతో ఉద్యోగ, ఉపాధ్యాయ సమస్యలపై పోరాటంలో అగ్రగామి సంస్థగా యూటీఎఫ్ నిలిచిందన్నారు.

పశువులతో పరేషాన్

- రహదారులపై హల్‌చల్ చేస్తున్న వైనం
- ప్రమాదాలు జరుగుతున్నా పట్టని అధికారులు

బద్వేలు అర్బన్ : పట్టణంలోని ప్రధాన రహదారుల్లో పశువులు హల్‌చల్ చేస్తున్నాయి. ఉదయం మొదలుకుని రాత్రి వరకు రోడ్లపై తిరుగుతూ ట్రాఫిక్‌కు అంతరాయం కలిగిస్తున్నాయి. పచ్చదనం కోసం డివైడర్లపై పెంచే మొక్కలను మేస్తున్నాయి. పశు యజమానులు నిర్లక్ష్యంగా వ్యవహరించడం, అధికారులు పట్టించుకోకపోవడంతో ఇవి అడ్డంగా వచ్చినపుడు వాహనదారులు, ప్రజలు ప్రమాదాల బారిన పడుతున్నారు.

బద్వేల్ పట్టణంలో ట్రాఫిక్ సమస్య తీవ్రంగా వేధిస్తోంది. దీనికి తోడు పశువులు రోడ్లపైనే సంచరించడంతో వాహనదారులు ఇబ్బందులకు గురవుతున్నారు. పట్టణంలోని వివిధ ప్రాంతాల్లోని పశు యజమానులు ఆవులకు ఆహారం అందించకుండా రోడ్లపైకి వదిలేస్తున్నారు. నిత్యం పట్టణంలోని ప్రధాన రహదారులపై చేరి వాహనాల రాకపోకలకు అంతరాయం కలిగిస్తున్నాయి. పట్టణంలోని నెల్లూరురోడ్డు, మైదుకూరు రోడ్డు, సిద్దవటంరోడ్డు, పోరుమామిళ్లరోడ్డు, కూరగాయల మార్కెట్ సమీపంలో, ఆర్టీసీ బస్టాండు ఆవరణలో పశువుల తాకిడి అధికంగా ఉంటోంది. పశువులు అడ్డురావడంతో ఇటీవల కొందరు ద్విచక్ర వాహనదారులు కిందపడి గాయాలపాలవుతున్నారు. కొంత మంది మృత్యువాతపడిన సంఘటనలున్నాయి. గతంలో మున్సిపల్ అధికారులు, పట్టణ పోలీసులు పశు పోషకులకు నోటీసులు ఇచ్చి కట్టడి చేశారు. ఆ తర్వాత షరా మామూలుగా పశుపోషకులు మళ్లీ నిర్లక్ష్యంగా రోడ్లపై పశువులకు వదిలేస్తున్నారు.


సిద్ధవటం రోడ్డులో గుంపులు గుంపులుగా సంచరిస్తున్న పశువులు

ఇబ్బందులు పడుతున్నాం



పట్టణంలో ఇటీవల కాలంలో ప్రధాన రహదారులపై పశువుల సంచారం అధికం కావడంతో తీవ్ర ఇబ్బందులు పడాల్సి వస్తోంది. వాటిని తప్పించుకుని వెళ్లాలంటే పెద్ద సాహసం చేయాల్సిందే. ఒక్కోసారి ప్రజలపై దాడిచేస్తున్నాయి.

– టి.వెంకటసుబ్బయ్య, బద్వేల్

అధికారులు చర్యలు తీసుకోవాలి



పట్టణంలో ఎక్కడ పడితే అక్కడ పశువులు సంచరిస్తుండటంతో రోడ్డు ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. అంతేకాకుండా నడిరోడ్లపై హల్‌చల్ చేస్తూ ఏ క్షణాన మీదకు వస్తాయో తెలియని పరిస్థితి ఏర్పడింది. పశువులు సంచరించకుండా చర్యలు తీసుకోవాలి.

– పి.ప్రసాద్, బద్వేలు

చర్యలు తీసుకుంటాం



పట్టణంలో పశువుల సంచారం అధికమైన మాట వాస్తవమే. ఇప్పటికే సంబంధిత పశు యజమానులకు నోటీసులు అందజేశాం. అయినా స్పందించలేదు. త్వరలోనే వాటిని గోశాలకు తరలించి రోడ్ల మీదకు రాకుండా చర్యలు తీసుకుంటాం.

– వి.వి.నరసింహారెడ్డి, మున్సిపల్ కమిషనర్

వ్యాధులు రాకుండా చర్యలు చేపట్టండి

రాజుపాళెం : ఇటీవల కురిసిన వర్షాలకు గ్రామాల్లో పారిశుధ్యం పనులు చేపడితే వ్యాధులు ప్రబలకుండా ఉంటుందని ఎంపీడీఓ ఏ.వెంకటరమణారెడ్డి తెలిపారు. రాజుపాళెంలోని మండల పరిషత్ సభా భవనంలో శుక్రవారం మండల రెండవ ఉపాధ్యక్షురాలు సుబ్బరత్నమ్మ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ గ్రామాల్లో పరిసరాల పరిశుభ్రత పనులు చేపట్టాలన్నారు. ఇందుకు గ్రామ పంచాయతీ నిధులను ఖర్చు చేయాలని చెప్పారు. పీఆర్ డీఈ లక్ష్మీనారాయణరెడ్డి మాట్లాడుతూ మండలంలో రూ.4.20 కోట్లతో 29 పనులకు నిధులు మంజూరయ్యాని తెలిపారు. ఏఓ శివరామకృష్ణారెడ్డి మాట్లాడుతూ ప్రస్తుతం కురిసిన వర్షాలకు సాగైన పంటలకు ఇబ్బంది లేదని, ఎక్కడైనా పంటలు దెబ్బతిని ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని రైతులకు సూచించారు. రీ సర్వేకు సంబంధించి ఈనెల 21వ తేదీ నుంచి గ్రామాల్లో గ్రామసభలు జరుగుతాయన్నారు. మండల వైద్యాధికారి నిఖిల, కేసీ కెనాల్ ఏఈ గురుమోహన్‌రెడ్డి, ఆర్ఐ హుసేన్‌రెడ్డి జెడ్పీటీసీ సభ్యురాలు అంజనీకుమారి, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ గౌతమి, ఏపీఓ లక్ష్మీ నారాయణ, మైలవరం ఏఈ లలిత, పశువైద్యులు ప్రదీప్‌రెడ్డి, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

ఉపాధి నిధులతో గ్రామాభివృద్ధి

గోపవరం : ఉపాధి హామీ నిధులతో గ్రామాభివృద్ధి జరుగుతుందని మాజీ ఎమ్మెల్యే విజయమ్మ పేర్కొన్నారు. పల్లె పండగ కార్యక్రమంలో భాగంగా ఎస్.రామాపురం, కొత్తరేకలకుంట ఎస్సీ కాలనీల్లో రూ.20 లక్షలతో చేపట్టిన సీసీరోడ్డు నిర్మాణాలకు ఆమె భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తొలి విడతగా రూ.1.26 కోట్లతో సీసీ రోడ్లు, మినీ గోకులాలు, డ్రైనేజీ పనులు చేపట్టనున్నట్లు తెలిపారు. ప్రజల అవసరాల మేరకు పనులు చేపట్టేలా ప్రతిపాదనలు పంపాలని అధికారులకు సూచించారు.ఈ కార్యక్రమంలో ఎంపీపీ ధనలక్ష్మి, జెడ్పీటీసీ జయరామిరెడ్డి, టీడీపీ మండల అధ్యక్షుడు ఎం.సుధాకర్‌రెడ్డి, పార్టీ నాయకులు ప్రసాద్ రెడ్డి, రామానాయుడు, డీఎల్‌డీఓ శ్రీనివాసులు, ఎంపీడీఓ రామనాథరెడ్డి, ఈఓపీఆర్‌డీ హసీనా, ఏఈ శ్రీనివాసులు, విజయకుమార్, శ్రీనివాసుల రెడ్డి, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

సీసీ దారికి భూమి పూజ

అట్లూరు : మండలంలోని కొండూరు బీసీ కాలనీలో రూ.40లక్షలతో చేపట్టిన సీసీ దారి నిర్మాణానికి బద్వేల్ మాజీ ఎమ్మెల్యే విజయమ్మ భూమి పూజ చేశారు. ఎంపీడీఓ భాస్కర్‌బాబు, డీఈ సూర్యనారాయణరెడ్డి, సర్పంచ్ సుధారాణి, టీడీపీ మండల అధ్యక్షుడు మల్లికార్జునరెడ్డి, మునిరెడ్డి, పాల్గొన్నారు.

రైతులకు నష్ట పరిహారం అందేలా చర్యలు

చాపాడు : గ్రీన్ ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్ జాతీయ రహదారి నిర్మాణంలో భూములు కోల్పోయి నష్ట పరిహారం అందని బాధిత రైతులకు నష్ట పరిహారం అందేలా చర్యలు తీసుకుంటామని స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ వి.వెంకటపతి అన్నారు. మండలంలోని అల్లాడుపల్లె, సోమాపురం గ్రామాలలో గ్రామ సచివాలయాల వద్ద శుక్రవారం భూ బాధితులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రెండో విడతలో భూములు కోల్పోయిన పలువురు బాధితులు తమకు పరిహారం మంజూరు కాలేదని అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. ఈ సందర్భంగా స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ మాట్లాడుతూ భూములు కోల్పోయినా పరిహారం అందని రైతులను గుర్తించేందుకు గ్రామాలలో సభలు ఏర్పాటు చేస్తున్నామన్నారు. బాధిత రైతులను గుర్తించి వారికి పరిహారం అందేలా చర్యలు తీసుకుంటామన్నారు. బాధిత రైతులు తమ వివరాలను రెవెన్యూ కార్యాలయ అధికారుల దృష్టికి తీసుకురావాలన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దారు రమాకుమారి, నేషనల్ హైవే తహసీల్దారు సుధాకర్, కలెక్టరేట్ డీటీ లక్ష్మీ నారాయణ, ఆర్ఐ శివశంకర్, వీఆర్‌ఓలు, సర్వేయర్లు తదితరులు పాల్గొన్నారు.


రైతులతో మాట్లాడుతున్న స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ వెంకటపతి

మానవ అక్రమ రవాణా నిర్మూలన అందరి బాధ్యత

మైదుకూరు : నవ అక్రమ రవాణా నిర్మూలన అందరి బాధ్యత అని మైదుకూరు డీఎస్పీ రాజేంద్ర ప్రసాద్ అన్నారు. మైదుకూరు పోలీసు సబ్ డివిజన్ కార్యాలయంలో మానవ అక్రమ రవాణా నిర్మూలనపై నిర్వహించనున్న కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్లను శుక్రవారం ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ పుట్టిన పసికందు నుంచి వయోవృద్ధుల వరకు సమాజంలో అక్రమ రవాణాకు గురవుతున్నారని తెలిపారు. అక్రమ రవాణాలేని సమాజాన్ని స్థాపించాలని పిలుపునిచ్చారు. మానవ అక్రమ రవాణాకు వ్యతిరేకంగా శనివారం మైదుకూరులో అమ్మ ఏవా సమితి ఆధ్వర్యంలో వాక్ ఫర్ ఫ్రీడం కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు సమితి అధ్యక్షుడు వాగ్దాడం శివశంకర్ తెలిపారు. ఈ కార్యక్రమం ఎన్జీఓ ఆస్ట్రేలియా ఏ-21, ది మూమెంట్ ఇండియా ముంబై, గ్రామ జ్యోతి సొసైటీ మదనపల్లి వారి సంయుక్త సహకారంతో నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో పాల్గొన్న అర్బన్ సీఐ సయ్యద్ హసం మాట్లాడుతూ ఎవరైనా మానవ అక్రమ రవాణా గురైతే 1098, 181 హెల్ప్‌లైన్ నంబర్లకు ఫోన్ చేసి ఫిర్యాదు చేయవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో ములపాకు నాగేశ్వర్‌రెడ్డి, మోతే ఉపేంద్ర, సుబ్బు, ఇమ్మడిశెట్టి సతీష్‌బాబు పాల్గొన్నారు.

మానవ అక్రమ రవాణాను నిర్మూలించాలి

ప్రొద్దుటూరు కల్చరల్ : మానవ అక్రమ రవాణానున నిర్మూలించాలని డీఎస్పీ భక్తవత్సలం తెలిపారు. స్థానిక డీఎస్పీ కార్యాలయంలో శుక్రవారం స్వచ్ఛంద సంస్థల ఆధర్యంలో శనివారం నిర్వహించనున్న వాక్ ఫర్ ఫ్రీడమ్, మానవ అక్రమ రవాణాకు వ్యతిరేకంగా చేపట్టనున్న ర్యాలీ పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మానవ అక్రమ రవాణాపై ప్రజలను చైతన్య పరచేందుకు ర్యాలీ నిర్వహించడం అభినందనీయమన్నారు. పలు స్వచ్ఛంద సేవా సంస్థల ప్రతినిధులు మాట్లాడుతూ శనివారం ఉదయం విజయకుమార్ సర్కిల్ నుంచి శివాలయం సర్కిల్ వరకు ర్యాలీ ఉంటుందని ప్రజలు, మహిళా సంఘాలు, కార్మికులు, విద్యార్థులు పాల్గొనాలని కోరారు.

కార్యక్రమంలో ఆదరణ స్వచ్ఛంద సేవా సంస్థ అధ్యక్షుడు బైసాని సత్యనారాయణ, మే ఐ హెల్ప్‌యూ ఫౌండేషన్ అధ్యక్షుడు మోరే లక్ష్మణరావు, పలు స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు బచ్చల సునీల్, కుతుబుద్దీన్, మధుసూదన్‌రెడ్డి, సంధ్య తదితరులు పాల్గొన్నారు.


వాల్ పోస్టర్లను ఆవిష్కరిస్తున్న డీఎస్పీ రాజేంద్ర ప్రసాద్

నూతన అంబేడ్కర్ విగ్రహం ఏర్పాటు చేస్తాం

బద్వేలు అర్బన్ : స్థానిక నెల్లూరు రోడ్డులోని పాత విగ్రహం స్థానంలో నూతన అంబేడ్కర్ విగ్రహం ఏర్పాటుచేయనున్నట్లు సీనియర్ దళిత నాయకులు నాగదాసరి చెంద్రాయుడు పేర్కొన్నారు. స్థానిక ఎన్జీఓ హోంలో జరిగిన దళిత ప్రజా సంఘాల నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ సుమారు 22 ఏళ్ల కిందట ఏర్పాటు చేసిన అంబేడ్కర్ విగ్రహం శిథిలావస్థకు చేరిందని, పట్టణానికి చెందిన ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాల నేతలు, ఉద్యోగులు కలిసి నూతన విగ్రహం ఏర్పాటు చేయాలని నిర్ణయించినట్లు తెలిపారు. అనంతరం అంబేడ్కర్ విగ్రహ నిర్మాణ కమిటీ కన్వీనర్‌గా నాగదాసరి చెంద్రాయుడు, కో కన్వీనర్‌గా జాలాగురయ్య, గౌరవ సలహాదారులుగా గురుమూర్తి, సభ్యులుగా రమణ, మస్తాన్, పి.వి.చంద్రశేఖర్‌లు నియమితులయ్యారు. సమావేశంలో చిన్నయ్య, దేవానందం, టి.రత్నం, ఎం.పిచ్చయ్య, ఓ.ఎస్.వి.ప్రసాద్, ఇమ్మానుయేల్, పి.వెంకటరమణ, మురళి తదితరులు పాల్గొన్నారు.

గ్యార్మి వేడుకల్లో పాల్గొన్న ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి

దువ్వూరు/చాపాడు : మండల పరిధిలోని ఇడమడక గ్రామంలో శుక్రవారం జరిగిన దస్తగిరి స్వామి గ్యార్మి పండుగ ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి, ఎమ్మెల్సీ రమేష్ యాదవ్, మాజీ ఎమ్మెల్యే శెట్టిపల్లె రఘురామిరెడ్డి, వ్యవసాయశాఖ మాజీ ప్రభుత్వ సలహాదారుడు తిరుపాల్‌రెడ్డి, ఉద్యాన శాఖ మాజీ ప్రభుత్వ సలహాదారుడు సంబటూరు ప్రసాద్‌రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఇడమడకకు చెందిన వైఎస్సార్‌సీపీ నాయకులు కడ్డీల నాగరాజు, నగిరి శ్రీకాంత్ ఆహ్వానం మేరకూ గార్మీ వేడుకల్లో వీరు పాల్గొన్నారు.

గృహ ప్రవేశానికి హాజరైన ఎంపీ

మండల పరిధిలోని చిన్నసింగనపల్లె గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ సోషల్ మీడియా నియోజకవర్గ కో కన్వీనర్ సన్నపల్లె దస్తగిరి నూతనంగా నిర్మించుకున్న గృహాన్ని శుక్రవారం ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి, ఎమ్మెల్సీ రమేష్‌యాదవ్, మాజీ ఎమ్మెల్యే రఘురామిరెడ్డి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ జయచంద్రారెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు శంకర్‌రెడ్డి, సంగన హరినాథ్‌రెడ్డి, గోపిరెడ్డి శ్రీనివాసులరెడ్డి, వీరారెడ్డి, ఓబుళరెడ్డి, రాజగోపాల్‌రెడ్డి, వెంకటసుబ్బారెడ్డి, మహబూబ్ షరీఫ్, చిన్న, చంద్ర ఓబుళరెడ్డి, నాగేంద్ర, రమణయ్య, సుధాకర్‌రెడ్డి, కిరణ్‌కుమార్‌రెడ్డి, లక్ష్మీరెడ్డి, ఏవీ రెడ్డి, బొమ్ము ఓబుళరెడ్డి, శివశంకర్‌రెడ్డి, చక్రధర్‌రెడ్డి, పల్లె రామయ్య, పద్మనాభరెడ్డి తదితరులు పాల్గొన్నారు.


గ్యార్మి వేడుకల్లో పాల్గొన్న ఎంపీ అవినాష్‌రెడ్డి, రఘురామిరెడ్డి, ఎమ్మెల్సీ రమేష్ యాదవ్

వైద్యులు సకాలంలో రావడం లేదు

జడ్పీటీసీ, వైస్ ఎంపీపీల ఆవేదన

పోరుమామిళ్ల : పోరుమామిళ్ల 50 పడకల ఆసుపత్రిలో రోగులకు న్యాయం జరగడం లేదని, వైద్యులు సకాలంలో రావడం లేదని జడ్పీటీసీ ముత్యాలప్రసాద్, వైస్ ఎంపీపీ సీఎం.బాషా, రంగసముద్రం సర్పంచ్ చిత్తా రవిప్రకాష్‌రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. శుక్రవారం ఉదయం ఆసుపత్రిని సందర్శించిన అనంతరం వారు మాట్లాడుతూ 14 మంది వైద్యులు ఉండాల్సిన ఆసుపత్రిలో కేవలం 5 మందే ఉన్నారని, గైనకాలజిస్ట్ శ్రీలత, గైనిక్ డాక్టర్ పవిత్ర లాంగ్ లీవ్ పెట్టి వెళ్లారని తెలిపారు. డాక్టర్ శివకృష్ణ డిప్యూటేషన్ ఈ నెల 14వ తేదీకి ముగిసిందని, ఆయన స్థానంలో ఎవరూ రాలేదన్నారు. 12 మంది నర్సులు బదిలీ కాగా, వారి స్థానంలో కొత్త వారెవ్వరూ రాలేదన్నారు. మూడు పోస్టులు ఖాళీగా ఉన్నాయని, ఆసుపత్రికి శుక్రవారం డెంటిస్టు, ఈఎన్‌టీ వైద్యులు మినహా ఇతరులెవ్వరూ రాలేదన్నారు. రోజూ 300 మంది వస్తున్న ఆస్పత్రిలో వైద్యులు సమయపాలన పాటించక పోవడం దారుణమన్నారు. డెంటల్ ఎక్స్‌రే ఉన్నా సీఆర్ అలాట్ చేయలేదన్నారు. వైయస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్నపుడు 30 పడకల ఆసుపత్రిని 50 పడకలకు పెంచారని, రూ. 25 కోట్లతో నూతన భవనాన్ని ఏర్పాటుచేశారన్నారు. వైద్యశాఖ ఉన్నతాధికారులు వెంటనే స్పందించి ఆసుపత్రి లోపాలపై చర్యలు తీసుకోవాలని కోరారు.


వైద్యులతో మాట్లాడుతున్న జడ్పీటీసీ, వైస్‌ఎంపీపీలు

విద్యార్థులు ప్రాక్టికల్ నాలెడ్జ్‌ను పెంపొందించుకోవాలి

ప్రొద్దుటూరు కల్చరల్ : బీటెక్ విద్యార్థులు ప్రాక్టికల్ నాలెడ్జ్‌ను పెంపొందించుకోవాలని జేఎన్‌టీయూఏ అకడమిక్ ఆడిట్ డైరెక్టర్ సురేష్‌బాబు తెలిపారు. మండల పరిధిలోని ఎస్ఆర్ఐటీ కళాశాలలో శుక్రవారం జాతీయస్థాయి టెక్నికల్ సింపోజియం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీటెక్ విద్యార్థులు కళాశాలల్లో నిర్వహించే సింపోజియంలో పాల్గొనాలని సూచించారు. దీనివల్ల సాంకేతిక నైపుణ్యం పెరుగుతుందన్నారు. ప్రతి విద్యార్థికి ప్రాక్టికల్ నాలెడ్జ్ విలువైనదని ఇటువంటి వేదికల్లో భిన్న కళాశాల విద్యార్థులు ఒక చోట చేరినప్పుడు నాలెడ్జ్ షేర్ చేసుకోవాలని వివరించారు. ఈ సింపోజియంలో అన్ని బ్రాంచిలకు సంబంధించిన విద్యార్థులకు పేపర్ ప్రజెంటేషన్, టెక్నికల్ క్విజ్, కోడింగ్ కాంటెస్ట్ నిర్వహించి ప్రతి బ్రాంచి నుంచి ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు, కన్సోలేషన్ బహుమతులు అందజేశారు. సింపోజియానికి వివిధ కళాశాలకు చెందిన 631 మంది విద్యార్థులు పాల్గొన్నారు. న్యాయనిర్ణేతలుగా ప్రొఫెసర్‌లు వ్యవహరించారు. కార్యక్రమంలో కళాశాల చైర్మన్ బసిరెడ్డి రాజేశ్వర రెడ్డి, ప్రిన్సిపాల్ పాండురంగన్‌రవి, వైస్ పెసిడెంట్ వీరకుమార్‌రెడ్డి, కరస్పాండెంట్ వీరకళ్యాణ్‌రెడ్డి, హెచ్‌ఓడీలు, అధ్యాపకులు పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధికి వార్డు మెంబర్లు కృషి చేయాలి

ప్రొద్దుటూరు : గ్రామాల అభివృద్ధికి వార్డు మెంబర్లు కృషి చేయాలని డీఎల్‌డీఓ సుబ్రహ్మణ్యం తెలిపారు. మండలంలోని ఆయా గ్రామ పంచాయతీల ఉపసర్పంచ్‌లతోపాటు ఇద్దరు వార్డు మెంబర్లకు శుక్రవారం ఎంపీడీఓ కార్యాలయంలో శిక్షణ ఇచ్చారు. ముందుగా మహాత్మా గాంధీ, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ చిత్రపటాలకు పూలమాల వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా డీఎల్‌డీఓ మాట్లాడుతూ గ్రామ పంచాయతీల అభివృద్ధిలో వార్డు మెంబర్లు కీలక పాత్ర పోషించాలని కోరారు. పెద్ద పంచాయతీల్లో సర్పంచ్‌లకు పరిధి ఎక్కువగా ఉంటుందని, స్థానికంగా వార్డు మెంబర్లే సమస్యలను గుర్తించి సర్పంచ్, కార్యదర్శుల దృష్టికి తీసుకెళ్లాలని సూచించారు. గ్రామ పంచాయతీ సాధారణ పరిపాలన, అభివృద్ధి కార్యక్రమాలు, డ్రైనేజీ, తాగునీరు, రోడ్లు, వీధి దీపాలు, పంచాయతీ సమావేశాలు, గ్రామ సభలు నిర్వహించడంలో వార్డు మెంబర్ల పాత్ర కీలకమని తెలిపారు. సమావేశంలో ఎంపీడీఓ సానేపల్లి సూర్యనారాయణరెడ్డి, ఈఓపీఆర్డీ రామాంజనేయరెడ్డి, కార్యదర్శులు పాల్గొన్నారు.

సమయానికి ఆరోగ్య సేవలు అందించాలి

రాజుపాళెం : గర్భిణులకు, బాలింతలకు, యుక్త వయసుగల అమ్మాయిలకు సరైన సమయానికి ఆరోగ్య సేవలు అందించి, రక్త హీనత లేకుండా చూడాలని జిల్లా గణాంకాధికారి రమేష్‌రెడ్డి తెలిపారు. మండలంలోని వెలవలి గ్రామ సచివాలయంను డీటీఎఫ్ టీం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం అందించే ఆర్థిక పరమైన అంశాలను గర్భిణులకు తెలపాలన్నారు. అంగన్‌వాడీ, ఆశా, ఆరోగ్య కార్యకర్తల రికార్డులు అన్ని ఒకే విధంగా ఉండాలని సూచించారు. అలాగే అన్ని వివరాలను ఆన్‌లైన్‌లో పొందుపరచాలని వారికి చెప్పారు. అనంతరం డీపీఎంఓ నారాయణ, డీపీ ఆరుణ, ఏఎస్ఓ జాకోబు, ఎంఐఎస్ రాజశేఖర్‌లు కౌమర బాలికల వివరాల రికార్డులను పరిశీలించి సూచనలు, సలహాలు ఇచ్చారు. కార్యక్రమంలో పీహెచ్‌ఎన్ వివలమ్మ, సూపర్‌వైజర్లు లక్ష్మీనారాయణ, సరస్వతి, హెల్త్ అసిస్టెంట్ పెంచలయ్య, ఏఎన్‌ఎంలు, ఆశాలు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

బద్వేలు అర్బన్ : సీజనల్ వ్యాధులపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మున్సిపల్ కమిషనర్ వి.వి.నరసింహారెడ్డి పేర్కొన్నారు. స్థానిక భావనారాయణనగర్ సచివాలయం పరిధిలో నిర్వహించిన ఫ్రైడే-డ్రైడే కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. అనంతరం పట్టణంలో నీటి సరఫరా తీరును ఆయన పరిశీలించారు. అనంతరం కమిషనర్ మాట్లాడుతూ ఇంటి పరిసరాల్లో పాత టైర్లు, పనికిరాని వస్తువులు, తాగి పడేసిన కొబ్బరి బోండాలు ఉంచుకోరాదన్నారు. వర్షం నీరు నిల్వ ఉంటే లార్వా వృద్ధి చెంది దోమలు పెరుగుతాయని అన్నారు. తెలుగుగంగ ప్రాజెక్టు నుంచి సురక్షితమైన నీటిని అందిస్తుంటే చాలా వార్డుల్లో నీటిని వృథా చేస్తున్నారన్నారు. అనంతరం సచివాలయాన్ని తనిఖీచేసి రికార్డులు పరిశీలించారు.

లాడ్జిల్లో అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే చర్యలు

పోరుమామిళ్ల : పోరుమామిళ్లలోని లాడ్జిల్లో అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే చర్యలు తీసుకుంటామని సీఐ శ్రీనివాసులు, ఎస్ఐ కొండారెడ్డి హెచ్చరించారు. స్థానిక పోలీస్‌స్టేషన్‌లో లాడ్జి యజమానులతో జరిగిన సమావేశంలో వారు మాట్లాడుతూ లాడ్జిలో దిగే వారి పూర్తి వివరాలు తెలుసుకొని, ఆధార్ కార్డు తీసుకోవాలని చెప్పారు. జూదం, వ్యభిచారం, మద్యపానం లాడ్జిల్లో జరగకూడదన్నారు.

మండల అభివృద్ధికి కృషి

చాపాడు : మండల అభివృద్ధికి కృషి చేస్తామని ఎంపీడీఓ ఎ. వీర కిషోర్ తెలిపారు. శుక్రవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఆయన బాధ్యతలు చేపట్టారు. చాపాడు ఎంపీడీఓగా ఉన్న శ్రీధర్‌నాయుడు మైదుకూరుకు బదిలీ కాగా ఈయన స్థానంలో అల్లూరి సీతారామరాజు జిల్లా మారేడుమిల్లి ఎంపీడీఓగా పని చేస్తున్న వీర కిషోర్‌ను చాపాడుకు బదిలీ చేశారు. ప్రజలు తమ సమస్యలు పరిష్కరించుకునేందుకు నేరుగా తనను కలవచ్చని వీర కిషోర్ తెలిపారు.

పత్రికా స్వేచ్ఛను హరిస్తున్న ప్రభుత్వం

చాపాడు : పత్రికా స్వేచ్ఛను హరించే స్థాయికి కూటమి ప్రభుత్వం దిగజారడం సిగ్గుచేటని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర నేత, ఏపీఎస్ ఆర్టీసీ మాజీ జోనల్ చైర్మన్ రెడ్యం వెంకటసుబ్బారెడ్డి అన్నారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ వరద ఖర్చులో ప్రభుత్వం అవినీతికి పాల్పడిందని సాక్షి దినపత్రికలో వార్తలు రాస్తే సాక్షి ఎడిటర్ మురళీపై విజయవాడ పటమట పోలీసులకు కేసు ఇస్తే కేసు నమోదు చేయడం ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేయడమేనని అన్నారు. రాజ్యాంగాన్ని టీడీపీ నేతలు ఉల్లంఘిస్తున్నారని విమర్శించారు. పత్రికా స్వేచ్ఛను హరిస్తూ కేసు పెడితే ప్రజాస్వామ్యం అభాసుపాలవుతుందని పేర్కొన్నారు.

30 రోజుల్లో సమాచారం

గోపవరం : సమాచారహక్కు చట్టం వజ్రాయుధం లాంటిదని, దరఖాస్తు చేసుకున్న 30 రోజుల్లో సమాచారం ఇవ్వాలని బద్వేల్ సహాయ వ్యవసాయ సంచాలకులు నాగరాజ పేర్కొన్నారు. బద్వేల్ వ్యవసాయ డివిజన్ కార్యాలయంలో సమాచార హక్కు చట్టంపై మండల స్థాయిలో అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి కార్యాలయంలో సమాచార హక్కు చట్టం బోర్డులు ఏర్పాటు చేయడంతోపాటు, అధికారుల వివరాలను పొందుపరచాలన్నారు. చట్టం ప్రకారం కోరిన సమాచారం అందుబాటులో లేకుంటే సంబంధిత శాఖ అధికారులకు దరఖాస్తు బదలాయించవచ్చని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో చంద్రమోహన్ రెడ్డి, రామకృష్ణయ్య, సిబ్బంది పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి చేద్దాం

బద్వేలు అర్బన్ : పంచాయతీ గ్రామాల్లో నెలకొన్న సమస్యల పరిష్కారానికి కలిసికట్టుగా కృషి చేద్దామని ఎంపీడీఓ మల్లేశ్వరి పేర్కొన్నారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయ సభా భవనంలో రాష్ట్రీయ గ్రామస్వరాజ్ అభియాన్ కార్యక్రమంపై ఉప సర్పంచులు, వార్డు సభ్యులకు ఆమె అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పారిశుద్ధ్యం, వ్యర్థాల నిర్వహణ, తాగునీటి సరఫరా, వీధి దీపాల నిర్వహణ అంశాలపై ప్రజాప్రతినిధులు అవగాహన కలిగి ఉండాలని కోరారు. ఏవైనా సమస్యలు ఉంటే గ్రామంలోనే చర్చించి పరిష్కరించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు రామసుబ్బారెడ్డి, ఈఓపీఆర్‌డీ ఆదినారాయణ, నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

రైతులను ప్రభుత్వాలు ఆదుకోవాలి

చాపాడు : జిల్లా వ్యాప్తంగా వారం రోజులుగా కురుస్తున్న వర్షానికి వరి, మినుము, జొన్న ఇంకా పలు రకాలైన పంటలు దెబ్బతిన్నాయని రైతులను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆదుకోవాలని ఏపీ రైతు సేవా సమితి జిల్లా అధ్యక్షులు ఏవీ రమణ కోరారు. మండలంలోని నక్కలదిన్నె, అనంతపురం గ్రామాలలో దెబ్బతిన్న పంటలను శుక్రవారం ఏపీ రైతు సేవా సమితి సభ్యులు పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు మాట్లాడుతూ దెబ్బతిన్న పంటలను అధికారులు పరిశీలించి రైతులను ఆదుకోవాలని, డిమాండ్ చేశారు.

భాగస్వాములు కావాలి

గోపవరం : గ్రామాభివృద్ధిలో ఉప సర్పంచులు, వార్డు సభ్యులు భాగస్వాములు కావాల ని ఎంపీడీఓ రామనాథరెడ్డి పేర్కొన్నారు. మండల అభివృద్ధి కార్యాలయంలో జరిగిన ఉప సర్పంచులు, వార్డు సభ్యుల శిక్షణ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ గ్రామ పంచాయతీల్లో సాధారణ పరిపాలన, ఏపీపీఆర్ చట్టం 1994 నిబంధనలు, గ్రామ పంచాయతీల్లో పారిశుద్ధ్యం, తాగునీటి సరఫరా, లేఅవుట్లు, బిల్డింగ్ ప్లాన్ నిబంధనలు, గ్రామ పంచాయతీల ఆస్తులు, వీధి దీపాలు, విద్యుత్ బిల్లుల నిర్వహణ, కోర్టు కేసులలో న్యాయపరమైన అంశాలపై ప్రజా ప్రతినిధులు అవగాహన పొందాలన్నారు. శిక్షణలో ఈఓపీఆర్డీ హసీనా, పంచాయతీ కార్యదర్శులు నిఖిత, వేమయ్య పాల్గొన్నారు.